క్లుప్తంగా

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



తల్లిపాల వారోత్సవాల ముగింపులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ పద్మావతి

ఏలూరు (టూటౌన్): తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సాధికారత అధికారిణి కెవివిఎల్ పద్మావతి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని స్థానిక గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పీడీ పద్మావతి మాట్లాడుతూ పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లి ముర్రిపాలు అందించాలని దీనివల్ల పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ నెల 1 నుంచి 7 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు విజయవంతమయ్యాయని చెప్పారు. ఏలూరు ప్రాజెక్టు అధికారిప. పద్మావతి మాట్లాడుతూ అంతరాలు పూరించి -తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం అనే నినాదంతో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ముగింపు కార్యక్రమంలో గర్భిణులకు సీమంతాలు, ఆరు నెలలు నిండిన బిడ్డలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ శశాంక్, డాక్టర్ మానస, పాఠశాల హెచ్‌ఎం కృష్ణభగవాన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, కార్యకర్తలు, ఆయాలు, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏలూరు కలెక్టరేట్ వద్ద పీడీఎస్‌యు ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. అంతకు ముందు జిల్లా పరిషత్ ఆఫీస్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఈబిచర్ల భూషణం మాట్లాడుతూ మూడు, నాలుగు, ఐదు తరగతుల విలీన ప్రక్రియ ఆపాలని, 84, 85, 117 జీవోలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. తల్లికి వందనం ఈ విద్యాసంవత్సరం నుంచి అమలు చేయాలని కోరారు.

60 మంది విద్యార్థులు ఎంపిక



దివీస్ ల్యాబ్ ప్రతినిధులను సత్కరిస్తున్న సీఆర్‌ఆర్ కళాశాల యాజమాన్య ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని సీఆర్‌ఆర్ పీజీ కళాశాలలో విశాఖపట్నంకు చెందిన దివీస్ ల్యాబొరేటరీస్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఆ సంస్థలో ట్రైనీ సూపర్‌వైజర్, గ్రాడ్యుయేట్ అప్రంటీస్ ఉద్యోగాల కోసం ఈ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 100 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 60 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశామని దివీస్ ల్యాబొరేటరీస్ హెచ్‌ఆర్ ప్రతినిధి ఏ. రాజేష్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్‌లలో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను డిగ్రీ, పీజీ కళాశాలల కరస్పాండెంట్‌లు కొడాలి సుబ్బారావు, కానాల శ్రీనివాసరావు, ప్రిన్స్‌పాల్ కేఏ రామరాజు, పీజీ డైరెక్టర్ వీఆర్ ఎస్‌బాబు, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ టీ. సుబ్రహ్మణ్యం అభినందించారు.

చేనేత పరిశ్రమను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): చేనేత పరిశ్రమను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక శనివారపు పేట వీవర్స్ కాలనీ వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా కన్నయ్య మాట్లాడుతూ చేనేత కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు లోనై దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత పరిశ్రమను ఆదుకోవడానికి బడ్జెట్లో అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

తల్లికి వందనం ఎప్పుడో..?

- బడులు తెరిచి రెండు నెలలు దాటినా జమ కాని సొమ్ము
- అసహనం వ్యక్తం చేస్తున్న తల్లులు
- గత ప్రభుత్వంలో సమయానికి అందిన అమ్మఒడి



గత ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం అందుకుంటూ చదువుకుంటున్న విద్యార్థినులు (ఫైల్)

ఏలూరు రూరల్: అధికారంలోకి వచ్చాక తల్లికి వందనం పథకం అమలు చేస్తాం...స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేల ఆర్థిక సాయమందిస్తాం.ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంతమందికి జమ చేస్తాం.మనస్సు ఉంటే మార్గం ఉంటుంది. డబ్బులు లేకపోతే సంపదను సృష్టించి ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తాం..ఇవీ సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు చెప్పిన మాటలు. ఆయన సీఎం అయ్యారు. నెల పాలన పూర్తికావొచ్చింది. సంక్షేమ పథకాల అమలు సమయం ఆసన్నమైంది. ఒక్కసారిగా సీఎం చంద్రబాబు మాటల్లో తటబాటు కనిపిస్తోంది. అధికారంలోకి రావడం కోసం నోటికి వచ్చిన హామీలన్నీ ఆకర్షణీయంగా గుప్పించి ఆయన ఎన్నికల తర్వాత వాటికి పక్కకు నెట్టే మాటలు మాట్లాడుతున్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఆ ఊసే లేదు.

అసలు మాట మరిచి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటిలో ఎంతమంది పిల్లలు చదివితే అంత మందికి తల్లికి వందనం పేరుతో ఒక్కో విద్యార్థికి రూ.15వేలు తల్లులకు అందజేస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు ప్రకటించారు. దీంతో ప్రజలు ఆశపడి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. అధికారంలోకి వచ్చాక హామీల్లో తడబాటు కనిపిస్తోంది. ఎంత మంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తామన్న బాటు ఆ మాటే ఎత్తడం లేదు. అసలుమాట మరిచి తల్లి ఖాతాలో జమ చేస్తామని చెబుతున్నాయి. అయితే ఇంత వరకూ కనీసం ఒక్క పిల్లాడికి కూడా సొమ్ము ఇవ్వలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఒత్తిడి ఎక్కువగా ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

చెప్పింది చేసినట్టు చేసిన గత ప్రభుత్వం

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో విద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ పాలన సాగించారు. చిన్నారుల బంగారు భవిష్యత్తు కోసం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. పిల్లలు ఉన్నతంగా ఎదగాలని ఆలోచన చేసి అమ్మఒడి పథకాన్ని అమలు చేశారు. 2019లో ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020-21 విద్యా సంవత్సరం నుంచి పిల్లలను బడికి పంపిస్తున్న తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15వేలు చొప్పున జమ చేశారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ అమ్మ ఒడి సాయం క్రమం తప్పకుండా అందించారు. విద్యా పథకాల అమలుపై క్యాలెండర్‌ను విడుదల చేసి చెప్పింది. చెప్పినట్టు సాయాన్ని అందజేశారు. గత నాలుగు సంవత్సరాలుగా అమ్మ ఒడి పథకం ద్వారా వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఏలూరు రూరల్ మండలంలో 2019 నుంచి 2022 వరకూ మొత్తంగా 7954మంది లబ్ధిదార్లకు గాను రూ.46కోట్ల54లక్షల50వేలు తల్లుల ఖాతాకు జమ చేసింది. ఏలూరు నగరంలో సుమారు రూ.120కోట్లు తల్లుల ఖాతాకు జమ చేసింది. మొత్తం -సుమారు 35 వేల మంది తల్లుల ఖాతాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సుమారు రూ.167 కోట్లు తల్లుల ఖాతాకు జమ చేసింది.

పిల్లలందరికీ వర్తింప జేయాలి



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చినహామీని నెరవేర్చాలి. తల్లికి వందనం పథకాన్ని అందరి పిల్లలకు వర్తింపజేయాలి. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అన్న మాట ప్రకారం తప్పకుండా అమలు చేయాలి

– పి కళ్యాణరావు వెంకటాపురం

కూటమి నేతలు ఇచ్చిన హామీని నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీని నెరవేర్చాలి. తల్లికి వందనం పేరున ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమంది పిల్లలకు ఈ పథకం ద్వారా నగదు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు హామీలను నమ్మి ఓట్లు వేశారు. ఇచ్చిన హామీ అమలు చేయాలి.

– బి వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ కాలనీ

టయోటా టీ- స్పర్ష్ షోరూమ్ ప్రారంభం



టయోటా అర్బన్ క్రూజర్ వాహనాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): టయోటా కిర్లోస్కర్ మోటార్స్ వాహనాల అధీకృత డీలరైన పృథ్వీ టయోటా ఆధ్వర్యంలో నగరంలో టీ-స్పర్ష్ షోరూంను ప్రారంభించింది. ఈ సందర్భంగా షోరూమ్ ప్రతినిధులు మాట్లాడుతూ తమ షోరూమ్‌లో సరికొత్త టయోటా అర్బన్ క్రూజర్ వాహన శ్రేణిని ఆవిష్కరించామన్నారు. ఈ కొత్త షోరూమ్‌లో అన్ని రకాల టయోటా వాహనాలు ప్రదర్శన, టెస్ట్‌డ్రైవ్ సౌకర్యం అందుబాటులో ఉంటుందన్నారు. వీటితో పాటు అన్ని టయోటా వాహనాలకు బుకింగ్స్ స్వీకరిస్తామని, డెలివరీ కూడా ఇక్కడే ఇస్తామని స్పష్టం చేశారు. ఈ సౌకర్యాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ షోరూమ్ ప్రారంభ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, టయోటా సౌత్‌జోన్ హెడ్ మహారాజా, ఆంధ్రప్రదేశ్ హెడ్ నిఖిల్, టయోటా ఏరియా మేనేజర్ శశికాంత్, పృథ్వీ టయోటా చైర్మన్ మాలెంపాటి రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీచంద్ర, సీఈఓ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు అండగా రెడ్‌క్రాస్



తలసేమియా చిన్నారులకు అందుతోన్న చికిత్సను పరిశీలిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలో తలసేమియా బాధిత చిన్నారులకు రెడ్‌క్రాస్ సొసైటీ అండగా నిలుస్తోందని ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఏలూరు సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 11మంది చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స అందించామని తెలిపారు. ప్రతి ఏడాది సుమారు 40మంది తలసేమియా, సికిల్ సెల్ బాధిత కేసులు నమోదు అవుతూ ఉన్నాయని తెలిపారు. తల్లితండ్రులోని జన్యుపరమైన లోపాలతో పుట్టే పిల్లలు ఈ వ్యాధుల బారిన పడుతున్నారని, తలసేమియా వ్యాధి రెండేళ్ల లోపు పిల్లల్లో ఎక్కువగా బయటపడుతుందని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల అనారోగ్య లక్షణాల ఆధారంగా వ్యాధిని గుర్తించి చికిత్స అందించాలని కోరారు. తలసేమియా బాధిత చిన్నారులకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అడుసుమిల్లి సత్యనారాయణ మధ్యాహ్న భోజనాన్ని, ఏలూరు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎన్‌జీవీబీ స్వామి పండ్లను పంపిణీ చేశారని, వారి సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారాం, డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కే వరప్రసాదరావు, కోశాధికారి రేవూరి శివప్రసాద్, డాక్టర్ జీ.స్పందన, ఏలూరు రోటరీ క్లబ్ కార్యదర్శి బీ.ప్రసాద్, పీఆర్‌వో కేవీ రమణ, తదితరులు ఉన్నారు.

ఏలూరు సిటీ పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఏలూరు సిటీ పాస్టర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరంలోని వివిధ క్రైస్తవ పాస్టర్ ఫెలోషిప్‌లు, అసోసియేషన్లు, సీఎస్ఐ, బాప్టిస్ట్, లూథరన్, పెంతెకోస్తు, సాల్వేషన్ ఆర్మీ, ఆర్‌సీఎం, బైబిల్ మిషన్, పెనూయేలు, ఇండిపెండెంట్ చర్చిలు ఏకమై ఏలూరు సిటీ పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. స్థానిక సీఎస్ఐ క్రైస్ట్ చర్చ్‌లో బుధవారం బిషప్ జాన్ ఎస్‌డీ రాజు, బిషప్ ఎలీషా రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ నూతన కార్యవర్గ చీఫ్ ప్యాట్రన్లుగా బిషప్ పొలిమేర జయరావు, బిషప్ జాన్ ఎస్‌డీ రాజు, బిషప్ ఎలీషా రాజు ఎన్నికయ్యారు. అసోసియేషన్ అడ్వైజర్స్‌గా ఎం. జ్యోతి రాజు, కే. సాల్మన్‌రాజు, గౌరవ అధ్యక్షుడిగా జీ. పాల్ అశీర్వాదం, టీ. ఎబినేజర్ శాస్త్రి ఎన్నికయ్యారు. వీరితో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీ. యోహాను, ఉపాధ్యక్షుడిగా పీవీ రాజు, కే. క్రిష్టాఫర్, మిల్టన్, వీ. రాజేంద్ర కుమార్, వైఐడీ ఇమ్మానుయేలు, జాన్ స్పర్జన్, డీ. యోబు ఎన్నికయ్యారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా వీ. ప్రభు కిరణ్, టీ. శ్యామ్ బాబు, సహాయ కార్యదర్శులుగా కే. జాన్ కిరణ్, కెప్టెన్ బెనర్జీ, కోశాధికారిగా పీ. శ్యామ్ సుందర్ ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎంఎం రవి కుమార్, డీ. రత్నరాజు, ఎం. ప్రభుదాసు, ఎస్. ప్రభుదాసు, సీహెచ్ ఇశ్రాయేలు, ఎస్‌ఎస్ సుధాకర్, లాజరస్, కే. సునీల్ ప్రేమ్ కుమార్, కే. డేవిడ్‌రాజు ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

చుట్టల కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



చుట్టల కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఏలూరు నగరంలో అధిక సంఖ్యలో పనిచేస్తున్న చుట్టల కార్మికులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చి వారికి ప్రత్యేక కాలనీ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆ కాలనీలో చుట్టలు చుట్టే కార్ఖానాలు సైతం ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ అనుబంధ చుట్టల కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం తంగెళ్లమూడి ఏరియా చోడిదిబ్బ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం జరిగింది. ఈ సమావేశానికి వి.చంటి అధ్యక్షత వహించారు. సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఉపాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్‌రావు, ఏలూరు నగర ప్రధానకార్యదర్శి యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎక్కువ మంది మహిళలు ఉన్న చుట్టల కార్మిక రంగాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో చుట్టల కార్మికులకు అదనపు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్.నెహ్రూబాబు, పి.గంగరాజు, వి.లక్ష్మి, ఎస్.శ్యామల, ఏ.అప్పలరాజు, పెద్ద సంఖ్యలో మహిళా చుట్టల కార్మికులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి



గ్రీన్ సిటీ ప్రాంతంలో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రే చేస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మాలతి

ఏలూరు (టూటౌన్): సీజనల్ వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు వహించాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి కోరారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకూ స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా మున్సిపల్ మలేరియా విభాగం వారితో కలిసి స్థానిక 19వ డివిజన్‌లోని గ్రీన్ సిటీ, శ్రీ సిటీ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిలువ నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం నిర్వహించారు. ఏలూరు నగర పారిశుద్ధ్య విభాగం ప్రతి రోజు పర్యవేక్షణలో భాగంగా హెల్త్ ఆఫీసర్ మాలతి ఉదయం 5 గంటల నుంచి పలు పారిశుద్ధ్య కార్మికుల మస్టర్ పాయింట్లను ఆకస్మిక తనిఖీ చేశారు.అందులో భాగంగా జోరు వర్షంలో పలు డివిజన్లలో తిరిగి జరుగు పారిశుద్ధ్య పనులను, డ్రెయినేజీ వ్యవస్థను పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు అందజేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైడి వెంకట్రావు, శ్రీనివాస్ మలేరియా ఇన్స్పెక్టర్ దత్తి వేణుగోపాల్ స్వామి, మలేరియా మేస్త్రి డి.దుర్గారావు,శానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు, డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్) : రైతాంగ సమస్యలపై రైతు కూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో ఆందోళనలకు రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చినట్లు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌కె భాషా తెలిపారు. ఇటీవల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు విజయవాడలో జరిగాయని ఈ సమావేశంలో 8 ప్రధాన సమస్యలపై ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం ఏలూరులోని పత్రికలకు విడుదల చేశారు. రాష్ట్రంలో 15 లక్షల మంది కౌలురైతులు ఉండగా కేవలం 50 వేల మందికి మాత్రమే పంట రుణాలు అందుతున్నాయని, కేంద్ర రిజర్వ్ బ్యాంకు ఏ విధమైన పూచీకత్తు లేకుండా రూ.1.50లక్షలు రుణాలు నేరుగా కౌలు రైతులకు మంజూరు చేయాలని స్పష్టంగా పేర్కొంటున్నా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలేవీ అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి వారికి నేరుగా రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఈ నెల 9న ఇచ్చిన క్విట్ కార్పొరేట్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాల్సిందే



జూట్‌మిల్లు సెంటర్‌లో వాహన తనిఖీలు చేస్తోన్న టూటౌన్ ఎస్ఐ మదీనా భాషా

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో మోటారు సైకిళ్లపై ప్రయాణించే వారు విధిగా హెల్మెట్ ధరించాల్సిందేననీ, రోడ్డు నిబంధనలు పాటించాలని ఏలూరు టూటౌన్ ఎస్ఐ మదీనా భాషా తెలిపారు. ఏలూరు డీఎస్పీ బీ.శ్రావణ్‌కుమార్ ఆదేశాలపై ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో నగరంలోని జూట్‌మిల్లు సెంటర్‌లో వాహన తనిఖీలు, హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మోటారు సైకిళ్లపై హెల్మెట్ లేకుండా సంచరిస్తోన్న వాహనదారులకు హెల్మెట్‌తో కలిగే ప్రయోజనాలను వివరించారు. హెల్మెట్ ధరించిన వాహనదారులకు పోలీస్ అధికారులు అభినందనలు తెలిపారు. మోటారు సైకిళ్ళపై ప్రయాణించే సమయంలో ఏదైనా ప్రమాదం చోటుచేసుకుంటే హెల్మెట్ మీ ప్రాణాలకు రక్షణగా నిలుస్తుందనీ, విధిగా హెల్మెట్ వినియోగించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహిస్తూ సురక్షితంగా ఇళ్లకు చేరేందుకు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

కొల్లేరు గ్రామాల తాగునీటి సమస్య పరిష్కరిస్తా

ఏలూరు రూరల్ : కొల్లేరు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆయన ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడు, ప్రత్తికోళ్లలంక, కొక్కిరాయలంక గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా పలువురు మహిళలు తాగునీటి సమస్య గురించి ఎమ్మెల్యేకు వివరించారు. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరచాలని కోరారు. ఈ సందర్భంగా పైడిచింతపాడు గ్రామంలో జరిగిన సభలో ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో కొల్లేరు గ్రామాలను అభివృద్ధి చేస్తానన్నారు. గ్రామాల్లో నాలుగు దశాబ్దాలుగా నివసిస్తున్న ప్రజలకు వాటాలు ఇవ్వాలని గ్రామ పెద్దలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీ.ప్రణవీతో పాటు టీడీపీ నాయకులు నేతలరవి, సైదు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధరణి మహిళా అభ్యుదయ సభ్యులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనం నందు డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్ బుధవారం ధరణి మహిళా అభ్యుదయ సంఘం (సెక్స్‌వర్కర్స్) సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ బుద్ధదేవ్ కర్మాస్కర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పశ్చిమ బెంగాల్ కేసు నందు ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులోని అంశాలపైన అవగాహన కలిగించారు. చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పీవీఎస్ మునీశ్వరరావు మాట్లాడుతూ జీవనోపాధికి కొందరు స్వచ్ఛందంగా ఈ వృత్తిని ఎన్నుకున్నారని, అటువంటి వారిని బలవంతంగా ప్రేరేపించడానికి వీలులేదని, వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత వ్యవస్థలపై ఉన్నదని అన్నారు. వారికి ఏవిధమైన సమస్యలు ఎదురైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయం అందిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ కూనా కృష్ణారావు, ధరణి మహిళా అభ్యుదయ సంఘం ప్రాజెక్టు ఆఫీసర్ విష్ణుతేజ, అధ్యక్షులు రత్నకుమారి, డీసీపీఓ సీహెచ్ సూర్యచక్రవేణి, దిశ ఎస్సై వి.క్రాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

ఏలూరు (టూటౌన్): ఏలూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా కోనే సీతారామారావు, ఉపాధ్యక్షుడిగా మంద్రు రాజేంద్ర, ప్రధాన కార్యదర్శిగా చింతమనేని రమేష్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రెటరీగా తిరిగిపల్లి సుబ్బారావు, కోశాధికారిగా బందెల నానాజీ, లైబ్రరీ సెక్రెటరీగా ఎంజివిఎస్ ఫణికుమార్, మహిళా రిప్రజెంటేటివ్‌గా పుట్టా కనకదుర్గా భవాని, జాయింట్ సెక్రెటరీగా నోముల రాముడు ప్రమాణ స్వీకారం చేశారు. ఏలూరు బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా అబ్బినేని విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. బార్ అభివృద్ధికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్ : ఏలూరు నగరానికి చెందిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు గొల్లాయిగూడేనికి చెందిన పుట్టా నాగరాజు (55) కారు డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తరచు మద్యం సేవిస్తూ ఉండడంతో ఇంట్లో భార్యతో గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ నేపథ్యంలో ఈనెల 5న ఇంట్లో గొడవ జరగటంతో తీవ్ర మనస్థాపానికి చెందిన నాగరాజు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడ్ని నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం 6న గుంటూరులోని జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	రద్దు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - తిరుపతి	16.00	4830	31